04-02-2025
మంగళవారం
మల్కాజిగిరి

jayabherinews

JAYABHERIDAILY.COM
ప్రభాత
# జయభేరి
తెలుగు దినపత్రిక
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 02 | సంచిక : 142 | పేజీలు : 8 | వెల : 4
ఎడిట... రఘు తిరుపతి రెడ్డి

JB
జయభేరి



## బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలు పురోగమించాయి

■ కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా

జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:

డబుల్ ఇంజన్ బిజెపి ప్రభుత్వం ఉన్న రాష్ట్రాలు గత పది సంవత్సరాల్లో పురోగమించాయని, కానీ ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సాకులు చూపుతో కేంద్రంతో పోరాడిన కారణంగా ఢిల్లీ వెనుకబడిందని భారతీయ జనతా పార్టీ (బిజెపి) అగ్ర నేత, కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా సోమవారం చెప్పారు. జంగ్‌పురాలో ఒక బహిరంగ సభలో మాట్లాడిన అమిత్ షా ఆప్ అధినేత అర్వింద్ కేజ్రీవాల్, ఆయన ఉప ముఖ్యమంత్రి మనీష్ సిసోడియాలను 'బడే మియాఁ, ఛోటే మియాఁ' అని పేర్కొన్నారు. వారిద్దరు ఢిల్లీని 'లూటీ చేశారు' అని ఆయన ఆరోపించారు. 'డబుల్ ఇంజన్ బిజెపి ప్రభుత్వం ఉన్న రాష్ట్రాలు గడచిన పది సంవత్సరాల్లో ప్రగతి సాధించాయి. ఢిల్లీ వెనుకబడింది. వారు సాకులు చెబుతూ, ఏడుపుగొట్టు పిల్ల వలె కేంద్రంతో పోరాడసాగారు' అని కేంద్ర హోమ్ శాఖ మంత్రి పేర్కొన్నారు.జంగ్‌పురా అసెంబ్లీ సీటు నుంచి బిజెపి అభ్యర్థి తార్విందర్ సింగ్

...మిగతాది 2 లో

# కేసీఆర్ వైల్డ్ ఫైరేనా..

## బిఆర్ఎస్ 5 లక్షల మందితో కేసీఆర్ సభ
## త్వరలో గజ్వేల్‌లో నిర్వహణ
## ప్రభుత్వ వైఫల్యాలే ఎజెండా



తెలంగాణ గట్టుపై సరికొత్త రాజకీయం. రోజుకో హాట్ టాపిక్. ఎన్నో పొలిటికల్ ఇష్యూస్. డెవలప్‌మెంట్ ఏదైనా రాజకీయమంతా ఆయన చుట్టే. విమర్శ అయినా..పొగడ్త అయినా..ఆయన మౌనంగా ఉన్నా.. మాట్లాడినా.. అన్నింటా గులాబీ దళపతి ప్రస్తావన ఉండాల్సిందే. సీఎం రేవంత్ సవాల్ చేసినా.. మంత్రులు రెచ్చిగొట్టినా సైలెంట్‌గా ఉంటూ.. ఇటు బీఆర్ఎస్ పార్టీలో అటు ప్రజల్లో..పొలిటికల్ సర్కిల్స్‌లో ఆసక్తిరేపుతూ వచ్చిన కేసీఆర్ ఎట్టకేలకు మౌనం వీడారు.

2 లో



## కులగణన సక్సెస్

■ దమ్ముంటే కేసీఆర్ అసెంబ్లీకి రావాలి


జయభేరి, హైదరాబాద్, ఫిబ్రవరి 3 :

తెలంగాణ వ్యాప్తంగా కుల గణన నిర్వహించిన విషయం తెలిసిందే. ఇప్పటికే కులగణన సర్వేకు సంబంధించిన నివేదికను కేబినెట్ సబ్ కమిటీకి అప్పగించారు. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన కులగణన విజయవంతం కావడంతో.. అన్ని రాష్ట్రాలు సర్వే నిర్వహణపై దృష్టి సారించాయి. తాజాగా బీఆర్ఎస్ పార్టీ కులగణన సర్వేపై విమర్శలు చేస్తున్న నేపథ్యంలో.. మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు.
మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించడం జరిగిందన్నారు. కుల గణన నివేదికను ఇప్పటికే కేబినెట్ సబ్ కమిటీకి అందించడం జరిగిందన, పలు అంశాలు చర్చించి కేబినెట్ నిర్ణయం తీసుకుంటుందన్నారు. తాము ఎన్నికల ముందు చెప్పినట్లుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వే పూర్తి చేసిందని, ఇప్పటికీ వివరాలు ఇవ్వనివారు ఎవరైనా ఉంటే వివరాలు అందించవచ్చని మంత్రి పొన్నం సూచించారు.ప్రధాన రాజకీయ పార్టీల పెద్ద నేతలు కూడా సర్వేకు వివరాలు ఇవ్వలేదని, కవిత ఒక్కరే సర్వే బృందానికి వివరాలన్నీ

...మిగతాది 2 లో

## వికసిత్ భారత్‌కు కేంద్ర బడ్జెట్‌తో బాటలు

- ఏపీకి ఆక్సిజన్ అందించేలా బడ్జెట్ కేటాయింపులు
- గత విధ్వంస పాలనతో 30 ఏళ్లు వెనకపడిన ఏపీ
- ఇప్పుడే నిలదొక్కుకుంటున్నాం.., 15% వృద్ధి రేటు లక్ష్యం
- ఢిల్లీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే... అదే మైనస్
- పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి...
- బీజేపీ గెలుపుతోనే అభివృద్ధి, సంక్షేమం
- ఢిల్లీలో మీడియా సమావేశంలో ఏపీ సీఎం చంద్రబాబు వెల్లడి



జయభేరి, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 3:

వికసిత్ భారత్ 2047 లక్ష్యాన్ని చేరుకునేలా కేంద్ర బడ్జెట్ ఉంది. బడ్జెట్‌లో ఏపీకి కేటాయింపులు చూస్తే వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం

...మిగతాది 2 లో



## ఉప ఎన్నికలకు సిద్ధం అంటున్న కేటీఆర్

జయభేరి, హైదరాబాద్ :

తెలంగాణలో ఉప ఎన్నికలు జరగనున్నాయా ఈ దిశగా కేంద్ర ఎన్నికల సంఘం నుంచి ప్రకటన ఏమైనా వచ్చిందా అలాంటిదేమీ లేకున్నా, బీఆర్ఎస్ శ్రేణులు ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలంటూ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు సోమవారం మధ్యాహ్నం ఓ ఆసక్తికర ట్వీట్ చేశారు. ఈ ట్వీట్ కు ఆయన సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన కామెంట్లను ట్యాగ్ చేశారు. ఈ ట్వీట్ ఇప్పుడు ఆసక్తి రేకెత్తిస్తోంది. తన ట్వీట్ లో కేటీఆర్ ఏమన్నారంటే.. పార్టీ ఫిరాయింపు దారులను కాంగ్రెస్ పార్టీ ఇక ఎంతమాత్రం కాపాడుకోలేదు. చట్టాన్ని గుర్తు చేస్తూ ఇటీవల సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలే ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. ఉప ఎన్నికలు ఇక తథ్యమేనని తేలిపోయింది. వాటికి బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధం కావాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ టికెట్లపై ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో దాదాపుగా 10 మంది ఇటీవలే కాంగ్రెస్ లో చేరిన సంగతి తెలిసిందే. తమ పార్టీ గుర్తులపై పోటీ చేసి ఆ తర్వాత కాంగ్రెస్ లో చేరిన వారి సభ్యత్వాలను రద్దు చేయాలని బీఆర్ఎస్ అసెంబ్లీ స్పీకర్ ను కోరింది స్పీకర్ కార్యాలయం నుంచి ఆశించిన మేర స్పందన కనిపించలేదు.


## తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు

■ కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్

జయభేరి, న్యూఢిల్లీ ఫిబ్రవరి 3 :



తెలుగు రాష్ట్రాల నుంచి మరిన్ని వందేభారత్ రైళ్లు నడుపుతామని కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. రైల్వే ప్రాజెక్టుల విషయంలో తెలంగాణకు అన్యాయం జరగలేదని వివరించారు. కాజీపేట రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేస్తున్నామని, కొన్ని పనులకు అనుమతులు రావాల్సి ఉన్నందున ఆలస్యం అవుతోందన్నారు. సోమవారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఇటీవల స్విట్జర్లాండ్ వెళ్లి అక్కడి రైల్వే ట్రాక్‌లను పరిశీలించాం. రైల్వే ట్రాక్‌ల నిర్వహణలో స్విట్జర్లాండ్ వ్యవస్థను పాటిస్తున్నాం. వందేభారత్ ట్రైన్లలో స్లీపింగ్ సీట్లపై ట్రయల్ జరుగుతోంది. ముఖ్యమైన స్టేషన్ల పరిధిలో రక్షణ వ్యవస్థ కవచ్ ఏర్పాటు చేస్తున్నాం. తెలంగాణలో 1326 కిమీ మేర ప్రస్తుతం కవచ్ టెక్నాలజీ ఉంది. మరో 1026 కిమీ మేర ఈ టెక్నాలజీ ఏర్పాటు చేస్తున్నాం. 2026 లోపు దేశమంతా కవచ్ టెక్నాలజీ అందుబాటు లోకి తెస్తాం. సికింద్రాబాద్‌లో కవచ్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేస్తాం. తెలంగాణ నుంచి ప్రస్తుతం ఐదు వందేభారత్ రైళ్లు నడుస్తున్నాయి. రాష్ట్రంలో అన్ని రైల్వే లైన్ల విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. పేద వర్గాల కోసం నమో భారత్ రైళ్లను నడుపుతున్నాం. త్వరలో దేశమంతా దాదాపు 100 నమోభారత్ ఎక్స్‌ప్రెస్‌లు తీసుకురానున్నాం. ఈ రైళ్ల ద్వారా పేద ప్రజలు ఎక్కువగా లబ్ధి పొందనున్నారు." అని కేంద్ర మంత్రి తెలిపారు.




## స్వాతంత్ర్యం వచ్చిన 77 ఏళ్ల తర్వాత గిరిజన గ్రామంలో తొలిసారి వెలిగిన లైట్లు

జయభేరి, అనకాపల్లి:

అనకాపల్లి జిల్లా రోలుగుంట అర్ల పంచాయతీ లోని నీలబంద గ్రామంలో 3 కుటుంబాలు, 26 మంది ఉంటున్నారు. ఈ గ్రామంలో స్వాతంత్రం వచ్చిన 77 ఏళ్ల తర్వాత విద్యుత్ సౌకర్యం రావడం, మొదటి లైట్ వెలగడంతో గ్రామ ప్రజలు ఆనందంతో, థింసా నృత్యం చేస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## ఇవాళ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం



జయభేరి, హైదరాబాద్,ఫిబ్రవరి 3:


ఈ నెల 4వ తేదీన తెలంగాణ అసెంబ్లీ సమావేశం కానుంది. అదే రోజు కులగణన సర్వే నివేదికను సభలో ప్రవేశపెట్టనుంది ప్రభుత్వం. ఆ రోజు ఉదయం 11 గంటలకు సభ సమావేశం కానుంది. 11 గంటలకు కులగణన సర్వే నివేదికను సభలో ప్రవేశ పెట్టనుంది సర్కార్. అదేరోజు.. ఉదయం 10 గంటలకు అసెంబ్లీ కమిటీ హాల్ లో క్యాబినెట్ సమావేశం కానుంది. క్యాబినెట్ లో ఆమోదం పొందిన

...మిగతాది 2 లో

jayabheridaily.com
ప్రభాత జయభేరి

# సామూహిక మరణాలను ఆపాల్సిందే..

సంగం నోస్ వద్ద వేర్వేరుగా వచ్చి గంగా, యమునా నదీ ప్రవాహాలు ఒక్కటిగా కలిసిపోయి ముందుకుసాగడం చూడొచ్చు. ఇక్కడ రెండు నదులు వేరువేరు రంగులలో కనిపిస్తాయి. యమునా నదీజలాలు లేత నీలం రంగులో, గంగాజలం కొద్దిగా బురదమయంగా కనిపిస్తుంది. యమునా నది ఇక్కడ గంగానదిలో కలిసి అంతర్థానమవుతుంది.



అంతర్వాహినిగా సరస్వతి నది సైతం సంగమించే ఈ ప్రాంతాన్నే కుంభమేళాలోని ప్రధాన సంగం ఘాట్‌గా చాలా మంది భావిస్తారు. వివిధ సంప్రదాయాలకు చెందిన అఖాడా సాధువులు తమ ఆచారాలు, అమృత స్నానాలను సంగం నోస్ వద్దే ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. శతాబ్దాల క్రితం జనాభా తక్కువ. అందులోనూ ఈ స్థాయిలో భక్తజనకోటి లేదు. కాబట్టి ఆనాడు కుంభమేళాకు విచ్చేసిన భక్తులంతా కేవలం ఈ త్రివేణి సంగమ స్థలి వద్దే పవిత్ర స్నానాలు ఆచరించే వారని స్థానికులు చెబుతున్నారు. దీంతో తాము కూడా ఈ సంగం నోస్ వద్దే పుణ్యస్నానాలు ఆచరించాలని ఈ విషయం తెల్సిన చాలా మంది భక్తులు భావిస్తారు. వాస్తవానికి 4,000 హెక్టార్లలో విస్తరించిన ఘాట్‌లలో సంగం నోస్ కూడా ఒకటి. సంగం నోస్ వద్ద ఎక్కువ మంది స్నానాలు ఆచరించడానికి వీలుపడదు. కానీ జనం ఇక్కడే ఎక్కువగా స్నానాలు చేసేందుకు ఆసక్తి చూపడంతో యోగి ఆదిత్యనాథ్ సర్కార్ దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఒడ్డు వెంట ఇసుక బస్తాలు వేసి, డ్రెడ్జింగ్ చేసి ఎక్కువ మంది కొనదాకా వచ్చి స్నానాలు చేసేలా దీనిని పెద్ద ఘాట్‌గా మార్చారు.కుంభమేళాలో మౌని అమావాస్య సందర్భంగా కోట్లాది మంది భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి రావడంతో తొక్కిసలాట చోటు చేసుకోవడం దురదృష్టకరం. ఈ దుర్ఘటనలో పదుల సంఖ్యలో భక్తులు మృతిచెందంతో పాటుగా 60 మంది గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి. గతంలో కూడా కుంభమేళాతో పాటుగా పర్వదినాలు, ఆధ్యాత్మిక సమ్మేళనాల సందర్భంగా ఇలాంటి తొక్కిసలాట ఘటనలు చోటు చేసుకున్నాయి.వందలమంది ప్రాణాలు కోల్పోయారు. లక్షల సంఖ్యలో భక్తులు హాజరయ్యే వేడుకల ఏర్పాట్లలో పాలకులు ఎంత అప్రమత్తంగా ఉండాలో ఈ ఘటనలు గుర్తు చేస్తున్నాయి. భక్తులు సైతం జాగ్రత్తగా వ్యవహరించాల్సిన అవసరాన్ని ఇవి నొక్కి చెప్తున్నాయి. వదంతులు, భక్తుల్లో భయాలు, తామే ముందుండాలనే తొందరపాటు కారణంగా జరిగే తోపులాటలే ఎక్కువగా ప్రాణనష్టానికి కారణమవుతున్నాయి.గత ఏడాది ఉత్తరప్రదేశ్‌లోని హత్రాస్‌లో భోలే బాబా సత్సంగ్‌లో జరిగిన తొక్కిసలాటలో వందమందికి పైగా ప్రాణాలు కోల్పోయిన ఘటన ఇంకా కళ్లముందు మెదలుతూ ఉంది. బాబా పాదధూళి కోసం భక్తులు ఎగబడ్డంతో జరిగిన ఈ తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారిలో అత్యధికులు మహిళలే.మొన్నటికి మొన్న తిరుమల వెంకన్న సన్నిధిలో ముక్కోటి దర్శనం టోకెన్ల కోసం భక్తులు ఒక్కసారిగా ఎగబడ్డంతో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోగా, 40 మంది గాయపడ్డారు. ఇలాంటి దుర్ఘటనల్లో ప్రాణాలు కోల్పోయే వారిలో ఎక్కువ మంది మహిళలు, చిన్న పిల్లలే ఉంటుండడం గమనార్హం.మహిళలు ఆందోళనకు గురికావడం లేదా కిందపడిపోవడం, తల్లుల చేతుల్లో లేదా వెంట ఉండే చిన్నారులు కూడా వారితో పాటే ఊపిరాడక చనిపోవడమే ప్రధాన కారణం. 2005లో మహారాష్ట్రలోని మంధర దేవి ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు వెళ్లడం, ఆలయమెట్లపైనుంచి జారి భక్తులు ఒకరిపై మరొకరు పడ్డంతో 340 మంది ప్రాణాలు కోల్పోయారు.2008లో హిమాచల్‌ప్రదేశ్‌లో నైనాదేవి ఆలయంలో జరిగిన తోపులాటలో 162 మంది భక్తులు దుర్మరణం పాలయ్యారు. కొండచరియలు విరిగిపడుతున్నాయన్న వదంతులే ఈ ప్రమాదానికి కారణం. 2008లో రాజస్థాన్‌లోని చాముండేశ్వరీ దేవి ఆలయంలో, 2013లో నవరాత్రుల సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని రత్నగఢ్ మందిరంలో జరిగిన తొక్కిసలాటలోనూ వందల ప్రాణాలు గాలిలో కలిసిపోవడానికీ ఇలాంటి వదంతులే కారణం.ఇలాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు ఘటనాస్థలంలో దృశ్యాలు హృదయవిదారకంగా ఉంటాయి. సాయం కోసం క్షతగాత్రులు చేసే ఆక్రందనలు, భక్తుల బ్యాగులు, ఇతర వస్తువులు చెల్లాచెదరుగా పడిపోవడమే కాకుండా ఒక్కోసారి డబ్బు, విలువైన వస్తువులు కోల్పోయి కట్టుబట్టలతో మిగిలిన సందర్భాలు కూడా ఉన్నాయి.కాగా మౌని అమావాస్య నాడు పవిత్ర స్నానాలకు పదికోట్ల మంది భక్తులు వస్తారని అధికారులు ముందునుంచీ చెబుతున్నా అందుకు తగ్గట్లు ఏర్పాట్లు మాత్రం చేయకపోవడమే తొక్కిసలాటకు కారణమని భక్తులు ఆరోపిస్తున్నారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో ఈ తొక్కిసలాట జరిగింది.వెలుతురు సరిగా లేకపోవడం, తోపులాటలో ఒకరిపై ఒకరు పడిపోవడం వారిపైనుంచి జనం నడుచుకు పోవడంతో ఎక్కువ మంది చనిపోవడమో, గాయపడ్డమో జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. దేశంలో ఇప్పటివరకు జరిగిన అన్ని తొక్కిసలాట ఘటనలకూ దాదాపుగా ఇలాంటివే కారణాలు కావడం గమనార్హం.గతంలో పోలిస్తే ఇప్పుడు ఇలాంటి ఆధ్యాత్మిక ఉత్సవాలకు భక్తుల రాక పెరిగింది. ప్రత్యేక రవాణా సదుపాయాలు, నిర్వాహకులు, ప్రసార మాధ్యమాలు చేసే ప్రచారం ఇందుకు ప్రధా న కారణం. వేదభూమి అయిన భారత దేశంలో అధ్యాత్మిక చైతన్యం మంచిదే కానీ ప్రాణంకన్నా ఏదీ ఎక్కువ కాదనే విషయాన్ని భక్తులు సైతం గుర్తుంచుకోవాలి.వీఐపీలకన్నా సామాన్య భక్తులకు ప్రాధాన్యత ఇస్తే ఎంత రద్దీనైనా అదుపు చేయవచ్చనే విషయాన్ని గ్రహిస్తే భవిష్యత్తులోనైనా ఇలాంటి సామూహిక మరణాలు చోటు చేసుకోకుండా ఉంటాయి.

# కేసీఆర్ వైల్డ్ ఫైరేనా..

జయభేరి, మెదక్, ఫిబ్రవరి 3:

ఎర్రవల్లిలోని తన ఫామ్‌హౌస్‌లో జహీరాబాద్ బీఆర్ఎస్ కార్యకర్తలతో కేసీఆర్ సమావేశం అయ్యారు. కాంగ్రెస్ పాలనపై నిప్పులు చెరిగిన గులాబీ బాస్.. గంభీరంగా అన్నీ గమనిస్తున్నానని చెప్పారు. తాను కొడితే మాములుగా ఉండదంటూ వార్నింగ్ ఇచ్చారు. తెలంగాణ శక్తి ఏందో కాంగ్రెస్ వాళ్లకు చూపించి మెడలు వంచుతామన్నారు. ఏడాది కాంగ్రెస్ పాలనలో తెలంగాణ ప్రజలు సంతోషంగా లేరన్న కేసీఆర్.. కాంగ్రెస్ వాళ్లు దొరికితే ప్రజలు కొట్టేలా ఉన్నారని హాట్ కామెంట్స్ చేశారు.తులం బంగారానికి ఆశపడి కాంగ్రెస్‌కు ఓటేసి ప్రజలు మోసపోయి గోసపడుతున్నారని చెప్పారు. భూముల ధరలు అమాంతం పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేసిన గులాబీ బాస్.. ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధం కావాలంటూ గులాబీ క్యాడర్‌కు, ప్రజలకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి నెలాఖరున భారీ బహిరంగ సభ పెడుతున్నామని.. అందరూ తప్పకుండా రావాలన్నారు కేసీఆర్.కాంగ్రెస్‌పై అంతటా అసంతృప్తే ఉందన్న ఆయన.. రైతుబంధుకి రాంరాం, దళితబంధుకు జైభీం చెబుతారని ఆనాడే చెప్పానని గుర్తు చేశారు. మంచేదో చెడేదో ప్రజలకు తెలిసి వచ్చిందని..కైలాసం ఆడితే పాము మింగినట్లు అయిందని.. కాంగ్రెస్ పాలనను ఉదహరించారు కేసీఆర్. మాట్లాడితే ఫామ్ హౌస్..ఫామ్ హౌస్ అని బద్నాం చేస్తున్నారని..ఫామ్ హౌస్‌లో పంటలే ఉంటాయని చెప్పుకొచ్చారు గులాబీ బాస్.గులాబీ దళపతి మౌనం వీడటం ఇప్పుడు ఆసక్తి రేపుతోంది. నాలుగు ప్రభుత్వ పథకాలు అమలుపై కన్ఫ్యూజన్..రైతు బంధు ఆలస్యంపై ప్రజల్లో అసంతృప్తి ఉన్న వేళ కేసీఆర్ సమరమే అంటూ ప్రకటించడం గులాబీ క్యాడర్‌లో జోష్ నింపుతోంది. అయితే ముందస్తు వ్యూహం ప్రకారమే ఫిబ్రవరి నుంచి ప్రజాక్షేత్రంలోకి రాబోతున్నారట కేసీఆర్.సంక్రాంతి పీడ దినాలు అయిపోయాక జనవరి 15 తర్వాత ఫీల్డ్‌లోకి దిగాలని భావించారు కేసీఆర్. ఇంకాస్త టైమ్ ఇచ్చి ఇప్పుడు ఫిబ్రవరిలో భారీ బహిరంగ సభ పెడతామంటున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏడాది సమయం ఇవ్వాలని భావించే కేసీఆర్..ఇప్పటివరకు ఆగారని..ఇక ఫుల్ టైమ్ పబ్లిక్‌లోనే ఉండేలా ప్లాన్ చేస్తున్నారని చెప్తున్నారు గులాబీ నేతలు. కాంగ్రెస్ వైఫల్యాల మీద సమరభేరి పూరిస్తామంటున్నారు. భారీ పబ్లిక్ మీటింగ్ పెట్టి రేవంత్ సర్కార్ ఫెయిల్యూర్స్‌ను ఎండగడతామని..ఇక జనంలోనే ఉంటామని చెప్పుకొస్తున్నారు.కేటీఆర్, హరీశ్‌రావు.. ప్రభుత్వంపై పోరాడుతూ ఫుల్ యాక్టివ్‌గానే ఉన్నప్పటికీ, కేసీఆర్ మీడియాలో కనిపించని లోటు మాత్రం స్పష్టంగా కనిపిస్తోందని..అటు ప్రజలు, ఇటు రాజకీయ వర్గాల్లో అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ మౌనం వీడటం ఆసక్తిని రేపుతోంది. ఈ మధ్యే కాంగ్రెస్ సర్కార్ ఏడాది పాలన..సీఎం రేవంత్‌పై పబ్లిక్ ఒపీనియన్ ఏంటో తెలుసుకునేందుకు కేసీఆర్ ఓ సర్వే చేయించినట్లు వార్తలు వచ్చాయి.కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత పరిస్థితుల్లో 10శాతం ఓట్లు తగ్గాయని కేసీఆర్ చేయించిన సర్వేలో తేలిందట. ఆ సర్వే రిపోర్టుకు తగ్గట్లుగానే ప్రస్తుత పరిస్థితులు కూడా ఉన్నాయని..

తాను పొలిటికల్ పిచ్‌లోకి దిగడానికి ఇదే సరైన టైమ్ అని భావిస్తున్నారట గులాబీ బాస్.ఇప్పటికే ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వస్తోంది బీఆర్ఎస్. రైతు ధర్నాల్లో కేటీఆర్..కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కార్నర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. అయితే కాంగ్రెస్ ఏడాది పాలన అయిపోవడంతో..ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపుతూ భారీ సభ పెట్టబోతున్నారట. ప్రత్యేకంగా పాటలు కూడా సిద్ధం చేయిస్తున్నట్లు సమాచారం. మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆధ్వర్యంలో సాంస్కృతిక బృందం పాటల రూపకల్పనలో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు..వాటి అమలు, ప్రభుత్వం తీరును ప్రజల్లోకి తీసుకెళ్లేలా ప్లాన్ రెడీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఉద్యమ సమయంలో మాదిరిగానే ఇప్పుడు కూడా సాంస్కృతిక బృందాలతో ప్రత్యేకంగా వీడియోలు రూపొందించే పనిలో గులాబీ నేతలు ఉన్నట్లు చెబుతున్నారు. షార్ట్ ఫిలిమ్స్ రూపొందించి ప్రభుత్వం ఏయే రంగాల్లో విఫలమైందో వివరించే ప్రయత్నం చేస్తున్నారట.బీఆర్ఎస్ హయాంలో వ్యవసాయ రంగం ఎలా ఉండే.. ఇప్పుడెలా ఉంది? ఐటీ పరిస్థితి ఏంటి? ప్రభుత్వ పథకాల అమలు ఎలా ఉంది? రియల్ ఎస్టేట్, కన్‌స్ట్రక్షన్ ఫీల్డ్‌లో ప్రభుత్వ వైఫల్యాలు ఎలా ఉన్నాయి.. ఇలా అన్ని అంశాలు ప్రజలకు అర్థమయ్యేలా ప్రచారం చేయబోతున్నారట. అందుకోసం ఇప్పటికే అంతా సిద్ధం చేసి పెట్టినట్లు సమాచారం.ఫిబ్రవరిలో భారీ బహిరంగ సభతో కేసీఆర్ ప్రజల ముందుకు వచ్చి..ఆ తర్వాత జిల్లాల పర్యటనలు వెళ్లే అవకాశం ఉందన్న టాక్ కూడా వినిపిస్తోంది. సరైన టైమ్ చూసి ప్రభుత్వ వైఫల్యాలపై గళమెత్తాలని కేసీఆర్ భావిస్తున్నారని.. ఇప్పుడు జనాల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత ఉందని దాన్ని క్యాచ్ చేసుకోవాలని అనుకుంటున్నారని తెలుస్తోంది. చూడాలి మరి గులాబీ బాస్ వ్యూహాలు ఎలా ఉండబోతున్నాయో.

**బిఆర్ఎస్ 5 లక్షల మందితో కేసీఆర్ సభ**

కాంగ్రెస్ సర్కారు పాలనా వైఫల్యాల పై నిలదీసేందుకు బీఆర్ఎస్ పార్టీ సిద్ధమవుతోంది. గజ్వేల్‌లో 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు సన్నద్ధమవుతోంది. నేను కొడితే మామూలుగా ఉండదు తొందర్లోనే భారీ బహిరంగసభ పెడదాం అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఇటీవలే పార్టీ శ్రేణులతో పేర్కొన్నారు. అందుకు అనుగుణంగానే సభ నిర్వహణకు గులాబీ పార్టీ కసరత్తు చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలనా వైఫల్యమే అజెండాగా ఈ సభను నిర్వహించాలని కారు పార్టీ భావిస్తోంది. కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్‌లోనే సభను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. కేసీఆర్ ఆదేశాలతో ఆ పార్టీ నేతలు బహిరంగ సభ నిర్వహణకు అనువైన స్థలాన్ని గుర్తించే పనిలో పడ్డారు. త్వరలోనే 5 లక్షల మందితో భారీ సభ నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సభకు అన్ని రకాలుగా అనువైన స్థలాన్ని గుర్తించిన తర్వాత ఏర్పాట్లు, జనం తరలింపు, ప్రజలను ప్రభావితం చేసేలా ఏయే అంశాలను ప్రస్తావించాలన్న దానిపై కేసీఆర్ పార్టీ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకుంటారని తెలుస్తోంది. కాగా, ఇటీవల జగిత్యాల నియోజకవర్గం బీఆర్ఎస్ నేతలతో జరిగిన సమావేశంలో కేసీఆర్. గంభీరంగా, మౌనంగా ఈ ప్రభుత్వాన్ని చూస్తున్నా ఎన్నో ప్రభుత్వాలను చూశా కానీ, ఇలాంటి సర్కారును ఎన్నడూ చూడలేదు. ఏడాదిలోపే కాంగ్రెస్ ప్రభుత్వంపై ఇంత వ్యతిరేకత వచ్చింది, అని చెప్పిన విషయం తెలిసిందే. రైతు భరోసా, రుణమాఫీ, రైతు ఆత్మహత్యలు, నేతన్నలు, ఆటో కార్మికులు ప్రాణాలు తీసుకోవడం వంటి వాటిపై రేవంత్ సర్కారును కేసీఆర్ నిలదీస్తారని గులాబీ శ్రేణులు చెబుతున్నాయి. కాంగ్రెస్ సర్కారు సాగునీటి ప్రాజెక్టులను నిర్వీర్యం చేస్తున్న అంశంతో పాటు రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను ఈ సభలో లేవనెత్తుతారని పేర్కొంటున్నాయి.

# ఇవాళ అసెంబ్లీ ప్రత్యేక సమావేశం

కులగణన సర్వేను 11 గంటలకు శాసనసభలో ప్రవేశపెట్టనున్న రేవంత్ ప్రభుత్వం.అటు కులగణన నివేదిక క్యాబినెట్ సబ్ కమిటీకి అందింది. కులగణన నివేదికను ప్లానింగ్ కమిషన్ అధికారులు సబ్ కమిటీకి అందజేశారు. తెలంగాణలో 50 రోజుల పాటు కులగణన సర్వే జరిగింది. 1,03,889 మంది అధికారులు ఈ సర్వేలో పాల్గొన్నారు. 96.9 శాతం కుటుంబాలను అధికారులు సర్వే చేశారు. 3.1శాతం కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదని కమిషన్ తెలిపింది.కులగణన సర్వేలో పాల్గొన్న సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. ఇది సువర్ణక్షరాలతో లిఖించదగిన రోజు అని ఆయన అన్నారు. ఈ సర్వేను అడ్డుకోవడానికి దుష్ప్రచారాలు చేశారని మంత్రి పొన్నం ఆరోపించారు.విపక్షాల కుట్రలను ఛేదించి ప్రభుత్వం ఈ సర్వేను పూర్తి చేసిందన్నారు. ఏడాదిలోనే సర్వే నివేదిక తయారు చేయడం మా చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారాయన. తెలంగాణ బలహీనవర్గాల గొంతుగా వారికి అండగా ఉండే కార్యక్రమం తమ ప్రభుత్వం చేస్తుందన్నారు మంత్రి పొన్నం ప్రభాకర్.కులగణన సర్వేకు సంబంధించిన రిపోర్టును ప్రణాళిక సంఘం ఇవాళ క్యాబినెట్ సబ్ కమిటీకి అందించింది. ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలోనే సబ్ కమిటీ.. ఈ నివేదికపై చర్చించింది. దాదాపు 50 రోజులు పాటు ఈ కులగణన సర్వే జరగ్గా, కోటి 10 లక్షల కుటుంబాలు ఇందులో పాల్గొన్నాయి. ఏయే కులాలకు సంబంధించి ఎంతమంది ఉన్నారు అనేదానిపై ప్రభుత్వం ఈ సర్వేలో ప్రధానంగా దృష్టి సారించింది. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు ఎంత ఉండాలి అనే దానిపై ప్రభుత్వం దృష్టి సారించింది.55.85 శాతం మంది బీసీలు ఉన్నారని కులగణన సర్వేలో తేలినట్లుగా తెలుస్తోంది. సర్వే నివేదికపై క్యాబినెట్ సబ్ కమిటీ సుదీర్ఘంగా చర్చించింది. త్వరలో మంత్రివర్గం ప్రత్యేకంగా సమావేశం కానుంది. అందులో కులగణన సర్వే నివేదికపై చర్చించనున్నారు. ఆ తర్వాత అసెంబ్లీ సమావేశంలో సర్వేకు సంబంధించిన నివేదికను ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు, ఇతర కులాలకు ఎంత మేర శాతం రిజర్వేషన్లు కల్పించాలి అనేదానిపై ఒక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

మంత్రివర్గ ఉప సంఘానికి కులగణన సర్వే చేరింది. దీనిపై తెలంగాణ మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, అధికారులు వివరాలు తెలిపారు. బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అవసరమైన వివరాల సేకరణకు కులగణన చేసినట్లు ఉతమ్ కుమార్ రెడ్డి అన్నారు.ఈ సర్వేలో 1,03,889 మంది ఎన్యుమరేటర్లు పాల్గొన్నట్లు వివరించారు. 96.9 శాతం (3.50 కోట్లు) మంది ఈ సర్వేలో పాల్గొని వివరాలు నమోదుచేసుకున్నారని తెలిపారు. 3.1 శాతం (16 లక్షల) మంది పలు కారణాలతో వివరాలు ఇవ్వలేదని చెప్పారు. బీసీ జనాభా లెక్కించాలనేది తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ కోరిక అని ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. భారత్‌లో ఇటువంటి సర్వే ఎక్కడా జరగలేదని తెలిపారు. వెనుకబడ్డ తరగతుల వారికి న్యాయం చేయాలని తమ ఆకాంక్ష అని ఉత్తమ్ చెప్పారు.

**కులగణన ప్రకారం వివరాలు**

తెలంగాణలో మొత్తం ఓసీల జనాభా 15.79 శాతం. ముస్లిం మైనారిటీల జనాభా 12.56 శాతం. ముస్లిం మైనారిటీ ఓసీల జనాభా 2.48 శాతం. బీసీల జనాభా 46.25 శాతం. ముస్లిం మైనారిటీ బీసీలు సహా మొత్తం బీసీల సంఖ్య 56.33 శాతం. ముస్లి మైనారిటీల బీసీల జనాభా 10.08 శాతం. ఎస్టీల జనాభా 10.45 శాతం. ఎస్సీల జనాభా 17.43 శాతం.

మొదటిపేజీ తరువాయి

## బిజెపి ప్రభుత్వం రాష్ట్రాలు..

మార్వాహ్‌పై పోటీ చేస్తున్న సిసోడియాపై అమిత్ షా సరికొత్త విమర్శనాస్త్రాలు సంధిస్తూ, మద్యం కుంభకోణం సందర్భంగా జైలుకు వెళ్లిన దేశంలో ఏకైక విద్యా శాఖ మంత్రి ఆయనే అని ఎద్దేవా చేశారు. కేజ్రీవాల్ ఢిల్లీ ప్రజలకు అబద్ధాలు చెప్పారని, వారికి ఆయన చెత్త, విషపు నీరు, అవినీతి మాత్రమే ఇచ్చారని అమిత్ షా ఆరోపించారు. 'బడే మియాఁ, ఛోటే మియాఁ తప్పుడు వాగ్దానాలు చేసిన తరువాత ఢిల్లీని దోచుకున్నారు. వారిద్దరు ఎన్నికల్లో ఓడిపోబోతున్నారు' అని ఆయన అన్నారు. ఢిల్లీని ప్రపంచ శ్రేణి నగరంగా తీర్చిదిద్దగల ఏకైక పార్టీ బిజెపి అని అమిత్ షా చెప్పార. యమునలో స్నానం చేస్తానన్న తన వాగ్దానాన్ని నెరవేర్చలేకపోయినందుకు కూడా కేజ్రీవాల్‌ను ఆయన దుయ్యబట్టారు. 'కేజ్రీవాల్ నదిలో స్నానం చేయలేదు, దానితో బిజెపి కార్యకర్తలు ఆయన కటౌట్‌ను నదిలో ముంచారు. నదిలో కాలుష్యం వల్ల కటౌట్ చాలా దెబ్బ తిన్నదని వారు గ్రహించి దానిని ఎయిమ్స్‌లో చేర్పించవలసి వచ్చింది' అని షా వ్యంగ్యోక్తి విసిరారు. యమున నది తీరాన్ని మూడు సంవత్సరాల్లో అభివృద్ధి చేస్తామని, ఢిల్లీ వాసులకు ఆయుష్మాన్ పథకం కింద ఉచిత ఆరోగ్యసేవలు అందిస్తామని బిజెపి అగ్ర నేత వాగ్దానంచేశారు. కేజ్రీవాల్ ముఖ్యమంత్రి కావడానికి ముందు ఇల్లు, కారు లేదా భద్రత వంటి అధికారపూర్వక సదుపాయాలు వినియోగించుకోబోనని వాగ్దానం చేశారని ప్రజలకు ఆయన గుర్తు చేశారు, కానీ, 'ముఖ్యమంత్రి అయిన తరువాత ఆయన కారు, భద్రత, బంగళా ఉపయోగించుకున్నారు, ఒక బంగళాతో సంతృప్తి చెందక ఆయన నాలుగింటిని కూలగొట్టి, డిజైనర్ పాలరాయి, రిమోట్ కంట్రోల్డ్ కర్టెన్లు. మోషన్ సెన్సర్ లైట్లు, బంగారు కమోడ్, రూ. 50 కోట్లు ఖరీదు చేసే తివాచీ, రూ. 15 కోట్లు విలువ చేసే వాటర్ ప్యూరిఫయర్, రూ. 15 లక్షలు విలువ చేసే రిక్లైనింగ్ సోఫాతో 50 వేల చదరపు గజాల్లో 'అద్దాల మేడ' కట్టించుకున్నారు' అని షా ఆరోపించారు.సిసోడియాపై అమిత్ షా విరుచుకుపడుతూ, ఆ ఆప్ నేత విద్యను అలక్ష్యం చేశారని, దానికి బదులు ఢిల్లీలో ప్రతి మూల, మతపరమైన ప్రదేశాల సమీపాన కూడా మద్యం దుకాణాలు తెరిచారని ఆరోపించారు. 2016 చివర్లో పాకిస్తాన్ కేంద్రంగా గల ఉగ్రవాదులపై 'లక్షిత దాడుల' గురించి కూడా అమిత్ షా మాట్లాడారు. 'పాకిస్తాన్ ఉరి, పుల్వామాలలో దాడులకు పురికొల్పింది, భారత ప్రధాని మన్మోహన్ సింగ్ కాదని, నరేంద్ర మోదీ అన్నది వారు మరిచారు. పది రోజుల్లోనే లక్షిత దాడుల నిర్వహణతో ఉగ్రవాదులను అంతం చేశాం' అని ఆయన చెప్పారు. గడచిన పది వత్సరాల్లో దేశంలో ఉగ్రవాద నిర్మూలనకు మోదీ కృషి చేశారని, ఆయన ప్రభుత్వం 2026 మార్చి నాటికి నక్సలిజాన్ని తుదముట్టిస్తుందని అమిత్ షా చెప్పారు.'జమ్మూ కాశ్మీర్‌లో 370 అధికరణాన్ని రద్దు చేసినట్లయితే 'రక్తపుటేరులు ప్రవహిస్తాయి' అని కేజ్రీవాల్, రాహుల్ గాంధీ, మమతా బెనర్జీ, అఖిలేశ్ యాదవ్, మెహబూబా ముఫ్తీ సహా ప్రతిపక్ష నేతలు హెచ్చరించారని కూడా ఆయన తెలిపారు. 'మేము 370 అధికరణాన్ని రద్దు చేశాం. రక్తపుటేరుల సంగతి మరచిపోండి, ఎవ్వరూ ఒక్క గులకరాయినీ విసిరే ధైర్యంచేయలేకపోయారు' అని ఆయన అన్నారు. అయోధ్యలో రామ మందిరం నిర్మాణం గురించి అమిత్ షా ప్రస్తావిస్తూ, 'మోదీ కేసు (బాబ్రీ మసీదు కూల్చివేత కేసు) గెలిచి, ఐదు సంవత్సరాల్లోనే రామ మందిరం నిర్మించే ముందు 550 సంవత్సరాల పాటు రామ్ లల్లా ఒక గుడారంలో ఉండిపోయారు' అని చెప్పారు.

## కులగణన సక్సెస్

అందించారన్నారు. బీసీలకు న్యాయం జరిగే సమయం వచ్చిందని, దానిని ఎవరు అడ్డుకోవాలని చూసినా ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఈ కార్యక్రమానికి అడ్డుపడే శక్తులు ఉంటే వారిని అడ్డుకొని ముందుకు పోవాలని కోరుతున్నట్లు మంత్రి పొన్నం సూచించారు. అన్ని జిల్లా కేంద్రాల్లో కాంగ్రెస్ శ్రేణులు, బీసీ సంఘాలు ప్రభుత్వానికి ధన్యవాదాలు చెబుతూ అభినందిస్తూ సంబరాలు చేయాలని మంత్రి పొన్నం పిలుపునిచ్చారు. నాడు ప్రభుత్వ ఉద్యోగులు సర్వేల కోసం వస్తే దాడులు చేసి అవమానించారన్నారు. నేడు అదే సర్వే విజయవంతం కావడంతో సైలెంట్ అయ్యారన్నారు. గతంలో మాదిరిగా సర్వేకు సంబంధించిన అన్ని వివరాలను ఫ్రిజ్ లో పెట్టే రకం తాము కాదని, తప్పనిసరిగా అన్ని వివరాలను సమాజం ముందు ఉంచుతామన్నారు. ఇంకా సర్వేపై ఎవరికైనా అనుమానాలు ఉంటే తక్షణం ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని, వివరాలు ఇవ్వనివారు ఎందుకు ఇవ్వలేదో కవిత ప్రశ్నించాలని మంత్రి అన్నారు. ప్రత్యేక అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ రావాలని, తాను కోరుకుంటున్నట్లు, అందుకు ప్రత్యేక ఆహ్వానం ఏమి కానీ అందజేయమని మంత్రి అన్నారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ రేపు సభకు హాజరవుతారని.. లేకుంటే వేరేలా ప్రజలు అర్థం చేసుకుంటారన్నారు. సర్వే గురించి సర్వేకు సహకరించని వారు కూడా మాట్లాడడం అర్ధరహితంగా ఉందని, రాష్ట్రంలో 96.9% సర్వే పూర్తిగా జరిగిందన్నారు. మంత్రి పొన్నం కామెంట్స్ ను బట్టి ఇప్పుడు బడా లీడర్స్ చాలా వరకు తమ వివరాలు ఇవ్వలేదని చెప్పవచ్చు. అసలు సామాన్య ప్రజానీకం అందించిన వివరాలను బడా నేతలు అందించకపోవడం వెనుక పెద్ద మతలబు ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కేవలం సామాన్యులకేనా, ఇప్పటికైనా మారండి.. సర్వే కు మీ వివరాలు అన్నీ ఇవ్వండి అంటూ సోషల్ మీడియా వేదికగా నెటిజన్స్ ఫైర్ అవుతున్నారు. మరి ఇప్పటికీ సర్వే వివరాలు చెప్పని ఆ నేతలు ఎలా స్పందిస్తారో వేచిచూడాలి.

## కేంద్ర బడ్జెట్‌తో బాటలు

ఇచ్చిన ఆక్సిజన్‌లా ఉంది. కేంద్రం అందిస్తున్న ఆర్థిక చేయూతతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే మా ముందున్న లక్ష్యం' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఢిల్లీలో సోమవారం మీడియాతో మాట్లాడారు. 202526 బడ్జెట్, ఏపీకి కేంద్రం అందిస్తున్న సాయాన్ని వివరించారు. ఇప్పటికే ప్రపంచమంతా మన దేశం వైపు చూస్తోందని, 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా భారత్ మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఏపీకి అన్ని విధాలా మేలు చేసేలా కేంద్ర బడ్జెట్ ఉంది. ఏఐ, గ్రీన్ ఎనర్జీ వంటి వినూత్నమైన పాలసీలతో మోదీ ప్రభుత్వం ముందుకెళుతోంది. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అని తెలుగుకవి గురజాడ అప్పారావు చెప్పిన సూక్తిని బడ్జెట్ తొలి వ్యాఖ్యల్లో ప్రస్తావించిన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేస్తున్నాను. అమరావతికి ఈ ఏడాదిలోనే రూ. 15 వేల కోట్లు కేటాయించబోతున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు ఇచ్చి కేంద్రం ఆదుకుంటుంది. పోలవరం ప్రాజెక్టుకు రూ.12,157 కోట్లు ప్రకటించిన కేంద్రం ఈ బడ్జెట్ లో రూ. 5,936 కోట్లు కేటాయించింది. విశాఖ స్టీల్ ను ఆదుకునేందుకు బడ్జెట్ కు ముందే కేంద్రం రూ. 11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించింది. ఈ బడ్జెట్ లో రూ. 3,295 కోట్లు కేటాయించారు. విశాఖ పోర్టుకు రూ.730 కోట్లు, విశాఖచెన్నై కారిడార్ కు రూ.285 కోట్లు కేటాయించారు. విశాఖ రైల్వే జోన్ భవనాలకు శంకుస్థాపనలు చేశారు. కొప్పర్తి, ఓర్వకల్లు ఇండస్ట్రియల్ కారిడార్ల అభివృద్ధికి రూ. 5 కోట్ల నిధులు ప్రకటించారు.

గత విధ్వంస పాలనతో అభివృద్ధిలో రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కుపోయింది. విభజనతోనే కాదు... గత ప్రభుత్వ విధ్వంసంతో ఏపీ దెబ్బతింది. సంపద దోచుకునేవాళ్లు కాదు... పంచేవాళ్లు కావాలి. ఇప్పుడిప్పుడే నిలదొక్కుకుంటున్నాము. 7 నెలల్లో రూ.7 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాము. 15 % వృద్ధి రేటు లక్ష్యంగా ముందుకెళుతున్నాము. దావోస్ పర్యటన విజయవంతమైంది. పలు అంతర్జాతీయ పరిశ్రమలు ఏపీకి రాబోతున్నాయి. ఉద్యో, ఉపాధి కల్పన ధ్యేయంగా అడుగులు వేస్తున్నాం. అభివృద్ధి , సంక్షేమం రెండూ సమానంగా ప్రజలకు అందిస్తున్నాము. ఏఐ, గ్రీన్ ఎనర్జీ, అగ్రికల్చర్, జీరో పావర్టీ, ఎంఎస్ఎంఈల విషయంలో కేంద్రం ఆలోచనలకు తగ్గట్టు ఏపీ అనుసరిస్తోంది. కొందరు రాజకీయ లబ్ధి కోసం బడ్జెట్‌లో ఏపీకి చేసిన కేటాయింపులపై విమర్శలు చేస్తున్నారు. బడ్జెట్‌లో ఏపీ పేరు ప్రస్తావనపై మాట్లాడుతున్నారు. కేంద్రం మన రాష్ట్రానికి నిధులు కేటాయించి ఆదుకోవడం ముఖ్యం కానీ ప్రతిసారీ పేరు చెప్పాల్సిన అవసరం లేదు. కేంద్రం ఇచ్చే చేయూతతో దేశంలోనే ఏపీని నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుతాం. 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నాం.

ఢిల్లీ మన రాజధాని. మనందరి ఆత్మ గౌరవం. మన దేశానికి వచ్చే విదేశీయులు ముందుగా వచ్చేది ఢిల్లీకే. గత పదేళ్లుగా పాలనా వైఫల్యంతో ఢిల్లీ ఉక్కిరిబిక్కిరి అవుతోంది. ప్రపంచంలోనే అత్యధిక వెదర్ పొల్యూషన్, పొలిటికల్ పొల్యూషన్ ఢిల్లీలోనే ఉంది. చేసిన పనులు ఫలితాలు ఇవ్వకపోవడంతో కేజ్రీవాల్ ఏవేవో చెప్పి ప్రజల్ని పొల్యూట్ చేయాలని చూస్తున్నారు. ఢిల్లీ గల్లీల్లో మురికినీరు, మంచినీరు కలిసిపోవడంతో ప్రజలు కలుషిత నీరు తాగుతున్నారు. ఢిల్లీలో ఎక్కడ చూసినా అపరిశుభ్రతే కనిపిస్తోంది. యమునా నది మొత్తంగా కలుషితమైంది. వాయు కాలుష్యం అయితే భరించలేని స్థితిలో ఉంది. ఢిల్లీకి ఎవరూ వచ్చేందుకు ఇష్టపడటం లేదు. బీజేపీతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యం కనుక ప్రజలు ఆలోచన చేయాలని సీఎం చంద్రబాబు అన్నారు.



## నూతన గృహప్రవేశంలో పాల్గొన్న నీలం మధు ముదిరాజ్

**జయభేరి, ములుగు, ఫిబ్రవరి 03 :**

మండలంలోని కొత్తూర్ గ్రామానికి చెందిన ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షులు జోగిని రవి ముదిరాజ్ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భం గా వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలి పారు. ప్రజలను ఆత్మీయము గా పలకరిస్తూ రవి ముదిరాజ్ కీ దేవ దేవుని ఆశీస్సులు కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జగదేవపూర్ మండల ముదిరాజ్ సంఘం యువజన అధ్యక్షులు ,హేమ సురేష్, చట్లపల్లి మాజీ ఎంపీటీసీ స్థానిక ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నర్సింలు, లింగ రెడ్డి పల్లి గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు స్థానిక ముదిరాజ్ సంఘం అధ్యక్షులు సుధాకర్, వట్టిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ సత్యనారాయణ. ముదిరాజ్ సంఘం యువ నాయకులు రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం

- చిన్నారులకు పలకల పంపిణీ




**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 03 :**

వసంత పంచమి పర్వదినం సందర్భంగా గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారంలోని రెండవ వార్డు అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులకు పలకలను పంపిణీ చేశారు. గజ్వేల్ పట్టణ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షులు సయ్యద్ బాబా, క్యాసారం గ్రామ ఇందిరమ్మ కమిటీ సభ్యులు కప్ప భాస్కర్ ల ఆధ్వర్యంలో అంగన్వాడి స్కూల్ పిల్లలందరికీ పలకలను పంపిణీ చేసి, చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. ఈ సందర్భంగా పలుకలతో పాటు బల్పాలు, బిస్కెట్లు చిన్నారులకు సయ్యద్ బాబా భాస్కర్ లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, ఆయమ్మ, చిన్నారులు పాల్గొన్నారు.

## గజ్వేల్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం

- గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి



**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 03 :**

గజ్వేల్ మున్సిపల్ పై కాంగ్రెస్ జెండా ఎగరేయటమే లక్ష్యంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పనిచేయాలని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తుంకుంట నర్సారెడ్డి పిలుపునిచ్చారు. గజ్వేల్ పట్టణ మాజీ సర్పంచ్ గుంటుకు రాముడు చిన్న కుమారుడు గుంటుకు మహేష్ తిరిగి కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పార్టీ కండువా వేసి పార్టీలో ఆహ్వానించిన నర్సారెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో రాబోయే పంచాయతీ ఎంపిటిసి జడ్పిటిసి కౌన్సిలర్స్ సింగిల్ విండో ఎన్నికలలో కాంగ్రెస్ అభ్యర్థులు గెలిచే విధంగా వ్యూహరచన చేస్తున్నట్టు పేర్కొన్నారు త్వరలో జండా ఆవిష్కరణ కార్యక్రమంలో ప్రజల వద్దకు వెళ్లే విధంగా ప్రాణాలిక సిద్ధం చేస్తున్నారు కావున కార్యకర్తలు సమన్వయంతో కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

## తెలుగు వెలుగు నంది పురస్కారము అందుకొన్న కోలాట గురువు




**జయభేరి, పరవాడ:**

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ తెలుగు రాష్ట్రాలు మొదలుగొని వివిధ రాష్ట్రాల దేవాలయాల్లో కోలాటం చేసినందుకు గాను స్వామి వివేకానంద జయంతి వేడుకలు సందర్భంగా తెలుగు వెలుగు సాహితీ వేదిక వారు ఏర్పాటు చేసిన విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం వేదికలో మంత్రి పాలెం గ్రామానికి చెందిన కోలాటం గురువు పచ్చికోరు వెంకట వరలక్ష్మి చేసిన కోలాటంలో ఆవిడ కనబరిచిన విశేష కృషికి గాను కళారంగంలో నంది 2025 అవార్డును వివిధ రాష్ట్రాలలో గుర్తింపుపొందిన పలువురు ప్రముఖులు చేతులు మీదుగ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగ ఆయా కోలాటం బృందం మరియు గ్రామ పెద్దలు మరియు ఇతర కుటుంబ సభ్యులు తెలుగు వెలుగు నంది 2025 పురస్కారము పచ్చికోరు వెంకట వరలక్ష్మిని వరించినందుకు గాను అటు గ్రామానికి మరియు ఇటు కుటుంబానికి మంచి పేరుప్రఖ్యాతలు తీసుకురావడం తో పాటు ఇటువంటి మంచి కళా నైపుణ్యం కలిగిన ఆమెను మరింత ప్రోత్సాహించాలని వారి యొక్క అభిప్రాయం పత్రిక ముఖంగ వ్యక్తం చేస్తూ తమ యొక్క అభినందనలు తెలియజేసారు.

# సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలతో కదిలిన యంత్రాంగం

- ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు భగాయతులో 5 ఎకరాల భూమి
- రజితాపరమేశ్వర్ రెడ్డి విజ్ఞప్తిపై స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు

**జయభేరి, ఉప్పల్ :**



ఉప్పల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు ఉప్పల్ భగాయత్ లో 5 ఎకరాల భూమిని కేటాయించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు ఆదేశించారు. భూమి కేటాయింపుల ప్రక్రియను వేగవంతం చేసి కళాశాల భవనాల నిర్మాణానికి కూడా కావాల్సిన ఏర్పాట్లను చేయాలని సూచించారు. డిగ్రీ కళాశాలకు ఉప్పల్ ఖాల్సాలో సర్వే నెంబర్ 581/1 లో రెండు ఎకరాల భూమిని కేటాయించేందుకు ఇటీవల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సర్వే నెంబర్ లో గల భూమి వివాదాస్పదంగా ఉంది. ఇప్పటికే కోర్టు కేసులు కూడా ఈ భూమిపై ఉన్నాయి.

ఇదే కాకుండా డిగ్రీ కళాశాలకు కేవలం రెండు ఎకరాల భూమిని మాత్రమే కేటాయిస్తే భవిష్యత్తులోనూ విద్యా సంస్థల ఏర్పాటుకు భూమి లభ్యత కష్టంగా మారే అవకాశం ఉంటుంది. ఇదే కాకుండా క్లియర్ టైటిల్ లేని భూమిలో విద్యా సంస్థలను ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో ఇబ్బందులు ఎదురవుతాయి. డిగ్రీ కళాశాల తో పాటు ఇంటర్, ఇతర ఒకేషనల్, ఇతర కళాశాలలు, వాటి ల్యాబ్ లను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇదే కాకుండా ఉప్పల్ లో ఎడ్యుకేషన్ హబ్ గా భవిష్యత్తులో తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. ఇదే అంశాలను ఉప్పల్ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి సీఎం రేవంత్ రెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించడంతో పాటు డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ఉప్పల్ భగాయత్ లో ఐదు ఎకరాల భూమిని తక్షణమే కేటాయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

సోమవారం ఇదే విషయమై ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పరమేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో కార్పోరేటర్లు చెర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి, కాప్రా కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ ను కలిసి కళాశాలకు సంబంధిత భూమి కేటాయింపు పై చర్చించారు. త్వరలోనే భూమి కేటాయింపు ప్రక్రియకు సంబంధించిన తుది ఆదేశాలను అధికారులు జారీ చేయనున్నారు.

# ముంపు గ్రామస్తులకు న్యాయం చేస్తాం

- అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 03 :**



కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామమైన మామిడాల గ్రామస్తులు ములుగు తహసీల్దార్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ కు వినతి పత్రం అందించారు.. కొండపోచమ్మ సాగర్ ముంపు గ్రామమైన మామిడి గ్రామస్తులు తమకు పరిహారం కింద ప్యాకేజీలు డబుల్ బెడ్ రూమ్ ఇల్లులు రాలేదని సోమవారం ములుగు తహసీల్దార్ కార్యాలయంలో అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ కు వినతి పత్రం అందజేశారు. వారు అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ తో మాట్లాడుతూ మాకు ఏడు సంవత్సరాలు నుండి రేపు మాపు అని రోజులు గడుపుతున్నారని, న్యాయంగా మాకు రావాల్సిన పరిహారాన్ని మాకు అందించాలని అడిషనల్ కలెక్టర్ ను కోరారు. ఇప్పటికీ చాలాసార్లు సంవత్సరాల నుండి ఎమ్మార్వో ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగి మేము అలసిపోయామని ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మా యందు కనికరపడి మాకు పరిహారం ఇప్పించాలని వారు విన్నపించారు. మేము పుట్టిన స్థలం, మా పెద్దలు సంపాదించిన స్థలాన్ని కోల్పోయిన న్యాయం చేయరా అని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో అనర్హులైన చాలామందికి ప్యాకేజీలు ఇల్లులు ఇచ్చారని అర్హులమైన మాకు ఇవ్వడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మమ్మల్ని ప్రభుత్వం గుర్తించడం లేదని గ్రామంలోని పెద్ద మనుషులు వారికి సంబంధించిన వారికి మాత్రమే పరిహారం ఇప్పించారని వారు అన్నారు. న్యాయబద్ధంగా మేము పోరాడుతున్నామని మాకు కచ్చితంగా మాకు రావాల్సిన పరిహారం ప్యాకేజీలు ప్రభుత్వం అందించాలని వేడుకున్నారు. గ్రామం కాళీ చేసేచేసే సమయంలో అధికారుల మాటలు విని మేము కాళీ చేశామని అయినా కూడా మమ్మల్ని ఇప్పుడు గుర్తించడం లేదని వారు అన్నారు గ్రామంలోని పెద్దమనుషులు మాకు న్యాయం చేయకుండా మమ్మల్ని కొండపోచమ్మ సాగర్లో ముంచారని బాధితులు వాపోయారు. ఇప్పటికైనా మాకు న్యాయబద్ధంగా ప్యాకేజీలు ఇప్పించాలని సిద్ధిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ అమీదుతో తో గోడు వెళ్లబుచ్చుకున్నారు.



**అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ వినతి పత్రం అందజేతా... కొండపోచమ్మ సాగర్ మంటూ గ్రామస్తులకు న్యాయం చేస్తాం**

అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ ములుగు తాసిల్దార్ కార్యాలయంలో పంపు బాధితులతో మాట్లాడారు త్వరలో మీ సమస్యలను తీరుస్తామని ఆయన హామీ ఇచ్చారు ఎవరు అధైర్య పడద్దని అందరికీ సమన్యాయం చేస్తామని అన్నారు.

**సానుకూలంగా స్పందించిన ఎమ్మార్వో**

సోమవారం ఎమ్మార్వో ఆరిఫా తో ముంపు బాధితులు ప్యాకేజీల గురించి చర్చించగా ఆమె సానుకూలంగా స్పందించారు ఆర్ డి ఓ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

# కేంద్ర బడ్జెట్ సంపన్న వర్గాలకు అనుకూలం.. పేదలకు వ్యతిరేకం

- సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య

**జయభేరి, గజ్వేల్, ఫిబ్రవరి 03 :**



కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం సంపన్న వర్గాలకు అనుకూలంగా పేదలకు కార్మికులకు రైతులకు వ్యతిరేకమైన బడ్జెట్ పెట్టడం జరిగిందని అన్నారు. సిఐటియు గజ్వేల్ ఇండస్ట్రియల్ కమిటీ ఆధ్వర్యంలో గజ్వేల్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ప్లే కార్లతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది ఈ సందర్భంగా సిఐటియు సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య మాట్లాడుతూ కార్పొరేట్ సంపన్న వర్గాలకు 3% పన్ను రాయితీలు గతంతో పోలిస్తే మూడు శాతం తగ్గించడం జరిగిందని దీంతో ప్రత్యక్ష పన్నులు పెరిగి పేద మధ్యతరగతి ప్రజలపై భారం పడుతుందని అన్నారు తెలిపారు 50 లక్షల కోట్ల బడ్జెట్లో కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలకు నిధులు కేటాయింపులు చేయలేదని అన్నారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఎల్ఐసి రంగాన్ని 100% విదేశీ పెట్టుబడులకు, ప్రైవేటీకరణకు అనుమతులు ఇచ్చిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలకు కారు చౌకగా అమ్మే విధంగా ప్రకటించడం జరిగిందని, రైతులకు మద్దతు ధర, ధరల స్థిరీకరణకు మారిటోరియం ప్రకటించలేదని, ఉపాధి హామీ కార్మికులకు నిధులను తగ్గించడం జరిగిందని అన్నారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే విధంగా ప్రభుత్వం తెలపడం జరిగిందని, కార్మికుల పని గంటలు పెంచే విధంగా కార్మిక కోడులు అమలు చేసే విధంగా ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు రైతులు, కార్మికులు వ్యవసాయ కార్మికులకు నష్టం చేసే విధంగా ప్రకటించిన బడ్జెట్ను వ్యతిరేకించాలని నిరసనగలం ఇవ్వాలని ప్రభుత్వ చర్యలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బండ్ల స్వామి, జిల్లా నాయకులు వేణుగోపాల్, చంద్రశేఖర్ రెడ్డి నరసింహులు, శ్రీనివాస్ యాదగిరి నరసింహా రెడ్డి మహేందర్ రెడ్డి కుమార్, వెంకట్ రాములు, ప్రవీణ్ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భరిణికం అనాథ ఆశ్రమమునకు ఆర్థిక సహాయం

**జయభేరి, పరవాడ:**



పెదముసిడివాడ పైడిమాంబ కాలనీ కి చెందిన దాలిబోయిన దేముడు (ఎక్స్ ఆర్మీ) తన మనవరాలు రేయాన్సీ శ్రీకరి మొదటి పుట్టిన రోజు సందర్భంగా పరవాడ మండలం భరిణికం గ్రామంలో ఉన్న న్యూ హోప్ చిల్డ్రన్స్ హోమ్ లో అనాథ పిల్లలకు అన్నదానం చేశారు అదే విధంగా అక్కడ ఉన్నవారికి నిత్య అవసరాల వస్తువులు పంపిణీ చేశారు. అక్కడ సమస్యలను అవసరాలను తెలుసుకొని వారికి రూ. 30,000 ను తమ విరాళంగా ఇచ్చి వారి దయగుణని చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు కే.ఎస్.ఆర్ రాధా రంగా మిత్రమండలి సభ్యులు బొండ లీలా కృష్ణ, చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు శనివాడ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## జ్ఞాన ప్రదాయని.. శ్రీ విద్యాధరి క్షేత్రం...

- వర్గల్ క్షేత్రంలో.. శ్రీ వసంత పంచమి వైభవం
- ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- 50 వేలకు మందికి పైగా అమ్మవారిని దర్శించుకున్న భక్తులు
- శ్రీ పంచమి పర్వదినాన... పది వేల అక్షరాభ్యాసాలు



**జయభేరి, వర్గల్/గజ్వేల్, ఫిబ్రవరి 03 :**

శ్రీ పంచమి పర్వదినాన వర్గల్ క్షేత్రం ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుంది. వసంత పంచమి మహోత్సవాన్ని పురస్కరించుకొని క్షేత్ర సముదాయం అమ్మవారి నామస్మరణతో మార్మోగగా, సోమవారం తెల్లవారుజామున శ్రీవిద్యా సరస్వతి అమ్మవారికి వేదమూర్తులైన బ్రాహ్మణోత్తముల మంత్రోశ్చరణల మధ్య ఆలయ వ్యవస్థాపక చైర్మన్ బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి శ్రీ పంచమి వేడుకలకు అంకురార్పణ చేశారు. అనంతరం అమ్మవారికి విశేష పంచామృతాభిషేకం, పల్లకి సేవ, లక్ష పుష్పార్చన, చెప్పన్ బోగ్ నివేదన, శ్రీ విద్యాజ్యోతి దివ్యదర్శనం తదితర కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ పర్వదిన సందర్భంగా క్షేత్రానికి 50వేల మందికి పైగా భక్తులు తరలిరాగా, పదివేలకు పైగా అక్షరాభ్యాసాలు జరిగినట్లు ఆలయ నిర్వాహకులు పేర్కొన్నారు. ముఖ్యంగా ఈ వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ముందస్తు ఏర్పాట్లు చేయగా, రెండు రోజులపాటు ఆలయ సముదాయం భక్తులతో కిటకిటలాడింది. ఈ వేడుకల్లో రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ రెడ్డి, డిసిసి అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి, ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ తదితర ప్రముఖులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాగా విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి తీర్థ ప్రసాదాలతో పాటు మహాప్రసాదం అందజేశారు.



jayabheridaily.com

ప్రభాత జయభేరి

# కేంద్ర ప్రభుత్వం మొండి వైఖరిని ప్రదర్శిస్తుంది

■ ఎమ్మెల్యే ప్రకాష్ రెడ్డి

**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 03:**




బిజెపి యేతర రాష్ట్రాలకు బడ్జెట్లో వివక్షత చూపుతూ సమైక్య స్ఫూర్తి కి విరుద్ధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తుందని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. కేంద్ర బడ్జెట్ లో తెలంగాణకు నిధుల కేటాయింపులో మొండి చేయి, కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుండి బస్టాండ్ మీదుగా అంబేద్కర్ సెంటర్ వరకు నిర్వహించిన నిరసన ర్యాలీ కార్యక్రమంలో టి పి సి సి ఉపాధ్యక్షులు దోమ్మటి సాంబయ్యతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, నల్ల బ్యాడ్జి లతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ.. కేవలం రాజకీయాల లబ్ధితోనే రాష్ట్రాలను నిర్లక్ష్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేయడం రాజ్యాంగ విరుద్ధమని అన్నారు. ప్రాంతీయ తత్వాన్ని రెచ్చగొట్టేలా రాష్ట్రాల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతుందని, బిజెపి పాలనలో అన్ని వర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. 2028 లో డి లిమిటేషన్ జనాభా ప్రాతిపదికన చేస్తామని కేంద్రం అంటుందని, దానితో దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం జరగబోతుందని అన్నారు. కెసిఆర్ రాజ్యాంగాన్ని మారుస్తానని అంటే ప్రజలు ఫాంహౌస్ కు పరిమితం చేశారని, రాజ్యాంగానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న బిజెపిని ఇంటికి పంపే రోజులు దగ్గరలో ఉన్నయ్ అన్నారు. రాష్ట్ర వనరుల నుండి వచ్చే ఆదాయం 60% బడ్జెట్ కేటాయింపులు చేయాలి, దానికి విరుద్ధంగా 6శాతం కూడా ఇవ్వడం లేదన్నారు. దేశాన్ని పాలించే సత్తా కాంగ్రెస్ పార్టీకే ఉందని



కులగనునకు వ్యతిరేకం బీజేపీ అని, కులగణన చేయాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అన్నారు. తెలంగాణ ప్రాంత బిజెపి మంత్రులు, ఎమ్మెల్యేలకు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్న వెంటనే రాజీనామా చేసి నిరసన తెలుపాలని డిమాండ్ చేశారు. విభజన హామీల పట్ల నిర్లక్ష్యం, తెలంగాణ పట్ల అన్యాయాన్ని ప్రశ్నించాల్సిన అవసరం మనందరిపై ఉందని, ఇందిరమ్మ ఇండ్లు అని పేరు పెడితే కేంద్రం నిధులు ఇవ్వమని కేంద్ర మంత్రి బండి సంజయ్ అంటున్నారని, ఎవరి జాగీర్ అని ప్రశ్నించారు. ఇందిరా గాంధీ రాజీవ్ గాంధీ పాలనలో ప్రతి పౌరునికి హక్కులు కల్పించడమే కాకుండా గరీబటావో నినాదంతో పేదల అభ్యున్నతికి అనేక పథకాలు అమలు చేశమని అన్నారు. ఫేక్ న్యూస్ తో తప్పుడు సమాచారాలను ప్రజలను తప్పుదారి పట్టించేలా వ్యవహరిస్తున్నారని, బి ఆర్ ఎస్ ను ప్రజలు ఇప్పటికే తరిమి కొట్టారని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డిపాజిట్లు రాకుండా చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 6 గ్యారెంటీలు, హామీలను అమలు చేస్తూ అనేక అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నామని, ఇచ్చిన మాట నిలబెట్టుకునేది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. ఈ సందర్భంగా టిపిసిసి ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్య మాట్లాడుతూ.. బిజెపి అధికారంలోకి వస్తే సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి, గత 10 సంవత్సరాల నుండి ప్రజలకు మొండి చేయి చూపాలని అన్నారు. బిఆర్ఎస్ 10 సంవత్సరాలలో 7 లక్షల కోట్లు అప్పుచేసి ప్రజల నెత్తిన భారం మోపిందన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి ఒకసారి చూపుతోందని, బడ్జెట్లో కేటాయింపులు చేయలేదన్నారు. బిజెపి చేస్తున్న అన్యాయాన్ని ప్రజలందరిలోకి తీసుకెళ్లాలని పిలునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బిజెపి మేలుతో రాష్ట్రాల పట్ల ఈ విధంగానే వివక్ష చూపిస్తే రాబోయే ఎన్నికల్లో బిజెపిని ప్రజలు ఇంటికి పంపడం ఖాయమన్నారు.




## బిజేపి నూతన జిల్లా అధ్యక్షులను సన్మానించిన డా. ఖాళీ ప్రసాద్

■ పరకాల బిజేపి నాయకుల ఆధ్వర్యంలో కార్యక్రమం

**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 03:**

భారతీయ జనతా పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లాలకు నూతనంగా నియమితులైన అధ్యక్షు లు కొలను సంతోష్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షులు గంటా రవిని బిజెపి పరకాల నియోజకవర్గ కంటెస్టెంట్ ఎమ్మెల్యే డా.పగడాల కాళీ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలో వారిని కలిసి శాలువాతో సన్మానించిన పరకాల పట్టణ అధ్యక్షులు గాజుల నిరంజన్, పరకాల మున్సిపాలిటీ మాజీ కౌన్సిలర్స్ ఆర్పీ జయంతి లాల్, కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణ చారి, బిజెపి నాయకులు మార్త బిక్షపతి, మార్త రాజభద్రయ్య, కుక్కల విజయ్ కుమార్, సంఘ పురుషోత్తం బూత్ అధ్యక్షులు ముత్యాల దేవేందర్, సంగీత తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేసినారు.

## నివాళులు అర్పించిన బండి రజనీ



**జయభేరి, హసన్ పర్తి, ఫిబ్రవరి 03:**

హసన్ పర్తి మండలం మల్లారెడ్డిపల్లిగ్రామ మాజీ సర్పంచ్ బైగాని శ్రీనివాస్ గత కొంత కాలంగా హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఈ రోజు మరణించడం జరిగింది. విషయం తెలిసిన వెంటనే మండల అధ్యక్షులు బండి రజనీ మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించడం జరిగింది. నివాళులు అర్పించిన వారిలో బండి రజనీ తో పాటుగా పావుశెట్టి శ్రీధర్, మాజీ కార్పొరేట్ చింతల యాదగిరి, బి అర్ ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గుడి నిర్మానానికి భూమి పూజ చేసిన ఎమ్మెల్యే రేవూరి



**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 03:**

శ్రీ బాలమానసాదేవి సహిత ద్వాత్రిమ్మర్గణపతి దేవాలయానికి భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి. సోమవారం దామెర మండలం పులుక్కుర్తి గ్రామంలో నిర్వహించిన శ్రీ బాలమానసాదేవి సహిత ద్వాత్రిమ్మర్గణపతి దేవాలయానికి ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షులు దొమ్మటి సాంబయ్యతో కలిసి పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి శంకుస్థాపన చేసి భూమిపూజా నిర్వహించారు. అనంతరం దేవాలయ నిర్వాహకులను ఘనంగా సన్మానం చేశారు.

## కిడ్స్ జోన్ ప్రారంభం



**జయభేరి, రాజన్న సిరిసిల్లా జిల్లా :**

సిరిసిల్ల 13వ వార్డు ప్రాంతంలో కిడ్స్ ప్లే జోన్ నూతన ప్రారంభం అయింది ఇందులో భాగంగా నిర్వాహకులు ఎడ్ల వసుధర్ మాట్లాడుతూ.. చంద్రంపేట ఎక్స్ రోడ్ ఎస్బిఐ లైఫ్ బిల్డింగ్ ఫ్లోర్లో నూతన ఇనాగరేషన్ మాజీ అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ నేరెళ్ల శ్రీకాంత్ గౌడ్, జెల్ల వెంకటస్వామి (డైరెక్టర్ బీసీ స్టడ్డి సర్కిల్ సిరిసిల్ల) గారి చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని పిల్లలకు ఆటవిడుపు కేంద్రంగా ఈ జోన్ ఏర్పాటు చేయడం జరిగిందని దీని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాల్సిందిగా ఈ కార్యక్రమంలో నేరేళ్ల శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. ఇంతటి చక్కటి కార్యక్రమాన్ని మా చేతుల మీదుగా ప్రారంభించడం మాకు చాలా ఆనందం కలిగించిందని ఎందుకంటే ఇప్పటి సమాజంలో చిన్న పిల్లల సైతం ఫోన్లకు ఆకర్షులై అనారోగ్యం పాలవుతున్న క్రమంలో ఇలాంటి మానసిక విల్లాసానికి సంబంధించిన ఆటవిడుపు పిల్లలకు చాలా మంచిదని పిల్లలు తల్లిదండ్రులు ఈ జోన్ను అందరూ వినియోగించుకోవాల్సిందిగా తెలియజేయడం జరిగింది.

## కోలాట బృందానికి 25 వేలతో గజ్జలు

■ డిండి మండల టిఆర్ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు చరణ్

**జయభేరి, డిండి :**

శాంతి గూడెం గ్రామంలో మహిళలు కోలాటం నేర్చుకుంటున్నారు అ కోలాట బృందానికి 25 వేల రూపాయలతో గజ్జలు బహుమానంగా ఇచ్చిన జరిగింది డిండి మండ బి ఆర్ ఎస్ యూత్ ఉపాధ్యక్షుడు చరణ్ చేసిన ఈ సహాయానికి కోలాట బృందం వారు చరణ్ ని గ్రామ ప్రజలు అభినందించినారు.



## ఉచిత కంటి వైద్య శిబిరాన్ని స్వదినియోగం చేసుకోండి

■ కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె గోపికృష్ణ

**జయభేరి, పరవాడ :**

అనకాపల్లి జిల్లా అందత్వ నివారణ సంస్థ వారి సౌజన్యంతో శంకర్ ఫౌండేషన్ విజన్ సెంటర్ మరియు అనిత ఆప్టికల్స్ ఆధ్వర్యంలో ఈనెల 05 వ తేదీన బుధవారం శంకర్ ఫౌండేషన్ విజన్ సెంటర్ అనిత ఆప్టికల్స్, పరవాడ కాటా ఎదురుగా సినిమా హాల్ జంక్షన్ నందు ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయడమైనదని ఈ అవకాశాన్ని పరిసర గ్రామ ప్రజలంతా ఉపయోగించుకోవలసినదిగా కంటి వైద్య నిపుణులు డాక్టర్ కె గోపికృష్ణ పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ శిబిరంలో అన్ని కంటి వ్యాధులకు ఉచితంగా కంటి పరీక్షలు చేయబడునని, శుక్లము ఆపరేషన్ కు ఎంపికైన నిరుపేదలకు డాక్టర్ సూచన మేరకు కాటారక్ట్ శాస్త్ర చికిత్స (లెన్స్) ఉచితంగా అమర్చి ఆపరేషన్ చేయబడినని ఈ శిబిరంలో కంటి ఆపరేషన్ కి ఎంపికైన వారిని అదే రోజు ఆపరేషన్ కొరకు శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి బస్సులో తీసుకు వెళ్ళబడనని మరియు తిరిగి క్యాంపు వద్దకు చేర్చబడునని తెలియజేశారు. ఈ శిబిరంలో తనిఖీ చేసుకున్న తర్వాత కళ్ళజోడు అవసరమైన వారికి కేవలం 899 రూపాయలకు ఇవ్వబడునని తెలిపారు. కాబ్బటి ఈ అవకాశాన్ని పరిసర ప్రజలు అందరూ వినియోగించుకోవాలని కోరారు.

## బడ్జెట్ ని చూసి ఓర్వలేకే కాంగ్రెస్ ధర్నాలు

■ భాజపా మున్సిపల్ అధ్యక్షుడు కావేరి శ్రీధర్



**జయభేరి, మేడ్చల్ :**

వికసిత భారత్ లక్ష్యంగా ప్రవేశపెట్టిన బిల్లును చూసి ఓర్వలేకే కాంగ్రెస్ పార్టీ ధర్నాలు, నిరసనలకు దిగుతుందని గుండ్లపోచంపల్లి మున్సిపల్ బీజేపీ అధ్యక్షులు కావేరి శ్రీధర్ అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ నరేంద్ర మోడీ నేతృత్వంలో ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బిల్లు మధ్యతరగతి కుటుంబాలకు బారి ఊరట కలిగించిందన్నారు. అదేవిధంగా వేతనజీవులకు వార్షిక ఆదాయం 12 లక్షల వరకు ఉన్న కూడా పన్ను కట్టకుండా ఉరట కల్పించింది. అలాగే రైతన్నలకు కిసాన్ క్రెడిట్ కార్డు గతంలో 3లక్షల పరిమితిని 5లక్షల వరకు పెంచిని ఘనత మోడీ ప్రభుత్వానిది అని అయన అన్నారు. 2027 కల్లా ప్రపంచంలోనే మూడవ ఆర్థిక వ్యవస్థ అవతరించే విధంగా బడ్జెట్ ఉందని అయన అన్నారు. ముందు కాంగ్రెస్ పార్టీ అమలు చేస్తా అన్న 6 గ్యారంటీల సంగతి చూడాలని అయన ఎద్దేవా చేసారు.

## ప్రభుత్వ ఉద్యోగుల్లో కలవరం షేక్ ఇస్మాయిల్

**జయభేరి, హైదరాబాద్ :**




రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన మొదటి మూడు నెలలు,, ఒకటో తారీఖున ప్రభుత్వ ఉద్యోగస్తులకు జీతాలు వేశారు, ఆ తర్వాత ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు సమయానికి అందడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు దుయ్య బట్టారు. రేవంత్ రెడ్డి పాలనలో రోజువారీ కార్యకలాపాలకు మినహా పెద్ద కార్యక్రమాలు ఏవి అమలు చేయడానికి సరిపడా నిధులు లేని పరిస్థితి, అప్పులు పెరుగుతున్న దానికి తగ్గట్టు పనులు చేయకపోగా ఆదాయం సృష్టించే మార్గాలు అన్వేషించడం లేదని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వంలో రాష్ట్ర ఆదాయం భారీగా పడిపోయిందని, మున్ముందు ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని పరిస్థితులు రాబోతున్నాయన్నారు. రాష్ట్ర ఆదాయం భారీగా పడిపోయింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం తెలంగాణను కైలాసంలో పెద్దపాము మింగినట్లు తయారయింది. రైతులకు పూర్తిగా రుణమాఫీ కాలేదు. మరోవైపు రైతు భరోసా ఇస్తారో లేదో తెలియదు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏవి అమలు కావడం లేదు.. బిఆర్ఎస్ పార్టీ హయాంలో ఆదాయం ప్రతి సంవత్సరం పెరిగిపోతే.. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తగ్గిపోతుంది. 13 వేల కోట్ల ఆదాయం పడిపోయిందని కాగ్ నివేదిక తెలిపింది. పరిస్థితులు ఇంకా దారుణంగా మారే అవకాశాలు ఉన్నాయి. ప్రభుత్వ పాలన ఇలాగే కొనసాగితే మరో నాలుగు నెలలు గడిస్తే జీతాలు ఇవ్వలేని పరిస్థితి వస్తుంది అని బిఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు షేక్ ఇస్మాయిల్ తెలిపారు. తెలంగాణలో ప్రస్తుతం ఉద్యోగులు పింఛన్దారులు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఉద్యోగులు గ్రహించారు. డిఏ లు ఇంకా పెండింగ్లో, పిఆర్సీ ఊసే ఎత్తడం లేదు కాంగ్రెస్ ప్రభుత్వం. పాత పింఛన్c విధానం మరిచిపోయారు. మరోవైపు పదవి విరమణ పొందిన ఉద్యోగులకు ఆర్థిక ప్రయోజనాలు అందించలేని పరిస్థితి ఏర్పడింది ఈ క్రమంలోనే రిటైర్మెంట్ వయసును పెంచేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం సిద్ధమైంది అందులో భాగంగా ఇప్పటికే విశ్వవిద్యాలయాల ప్రొఫెసర్ల వయస్సు 60 నుంచి 65 కు పెంచింది. ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉంటే ఎలాగోలా చేసి ఉద్యోగులతో పాటు అన్ని వర్గాలకు సమానంగా చూసుకున్న రోజులను అందరూ గుర్తు చేసుకుంటున్నారని షేక్ ఇస్మాయిల్ తెలిపారు.

## పరకాల ఎంఈఓ పై కలెక్టర్ కు పిర్యాదు చేసిన ఎస్ఎఫ్ఐ

■ పరకాల ఎంఈఓ ఆఫీసులో మెసెంజర్ పోస్టు కై జరిగిన అవినీతి పై కలెక్టర్ కి పిర్యాదు


**జయభేరి, పరకాల, ఫిబ్రవరి 03:**



సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకి ఎస్ఎఫ్ఐ నాయకులు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్ మాట్లాడుతూ మెసెంజర్ పోస్ట్ కోసం పరకాల ఎంఈఓ ఒకే పత్రికలో ప్రకటన వేయడం జరిగింది. మరుసటి రోజు వెళ్లి అప్లికేషన్ పెట్టుకుందామని నిరుద్యోగ యువతి యువకులు వెళ్లి అప్లికేషన్ కోసం ఆఫీసులో ఉన్న సిబ్బంది అడిగితే మేము ఎలాంటి అప్లికేషన్ తీసుకోవడం లేదు అన్నారు. ఎంఈఓ ని మేము అడుగుతే అప్లికేషన్స్ మేము తీసుకున్నాము అని మాకు చెప్పారు. మీరు తీసుకున్న అప్లికేషన్స్ చూపించండి అని మేము అడుగుతే మీకు మేము చూపెట్టము అని పై ఆఫీసర్లకు పంపాము అని చెబుతున్నారు. ఆ పోస్టుపై కలెక్టర్ వెంటనే స్పందించాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. తక్షణమే కలెక్టర్ విచారణ చేసి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కళ్యాణ్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు బొక్కల పాటి సాల్మన్ రాజ్ పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో మహిళ అఘోరి?

**జయభేరి, రాజన్న సిరిసిల్ల జిల్లా:**



వేములవాడ రాజన్న ఆలయంలోని దర్గాను కూల్చివేస్తామన్న అఘోరి, తన శపథం నెరవేర్చుకోవడంలో విఫలమైంది, ఆలయం వైపు బయలుదేరిన అఘోరిని, తంగళ్ళపల్లి మండలం జిల్లెల గ్రామ శివారులో పోలీసులు ఆపివేశారు. తను కారులో నుంచి దిగకపోవడంతో పోలీసులు మహిళా అఘోరి వాహనాన్ని టోయింగ్ వ్యాన్ తో బంధించి హైదరాబాద్ రూట్లో పోలీసులు తరలించారు. దర్గాను కూల్చి వేస్తానని అఘోరి ముందే చెప్పారు. దాంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. వేములవాడ పట్టణానికి నలువైపులా పోలీసులు మోహరించారు. పోలీసులకు తలనొప్పిగా మారిన మహిళా అఘోరీ వ్యవహారం, రోజురోజుకు మితిమీరి పోతుంది, రోజు ఏదో ఒక ఊరికి వెళ్లడం స్థానికులతో గొడవ పడడం గ్రామస్తులతో వాగ్వాదం పెట్టుకోవడం.. రచ్చ రచ్చ చేయడంతో అఘోరి పై చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను కోరుతున్నారు.



# విష్ణు మంచు 'కన్నప్ప' ప్రళయ కాల రుద్రుడిగా 'ప్రభాస్'


విష్ణు మంచు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా 'కన్నప్ప' సినిమాను మోహన్ బాబు అత్యంత భారీ ఎత్తున నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. అవా ఎంటర్టైన్మెంట్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్ల మీద నిర్మిస్తున్న ఈ చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. కన్నప్ప చిత్రాన్ని ఏప్రిల్ 25న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు. ఈ క్రమంలో ప్రమోషన్స్ పెంచేశారు. ప్రతీ సోమవారం కన్నప్ప చిత్రంలోని పాత్రకు సంబంధించిన అప్డేట్ ఇస్తూ వస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా సోమవారం నాడు కన్నప్ప నుంచి ప్రభాస్ పాత్రను రివీల్ చేశారు. రుద్రుడిగా ఈ చిత్రంలో ప్రభాస్ అద్భుతంగా కనిపించబోతున్నాడు. ప్రళయ కాల రుద్రుడు.. త్రికాల మార్గదర్శకుడు.. శివాజ్ఞ పరిపాలకుడు అంటూ ప్రభాస్ పోషిస్తున్న పవర్ ఫుల్ పాత్రను అందరికీ పరిచయం చేశారు. ప్రభాస్ వేషధారణ, లుక్ చూస్తుంటే దైవత్వం ఉట్టి పడేలా కనిపిస్తోంది. ఇప్పటికే కన్నప్ప నుంచి శివుడిగా అక్షయ్ కుమార్, పార్వతీ మాతగా కాజల్ ఫస్ట్ లుక్ పోస్టర్లను చిత్రయూనిట్ రివీల్ చేసింది. కన్నప్ప చిత్రంలో మోహన్ లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు, బ్రహ్మానందం వంటి మహామహులెందరో నటిస్తున్నారు. ఇది వరకు రిలీజ్ చేసిన టీజర్ అందరిలోనూ అంచనాలు పెంచిన సంగతి తెలిసిందే. ఇప్పుడు కన్నప్ప టీం ద్వాదశ జ్యోతిర్లింగాలను సందర్శించే పనిలో పడింది. సినిమా విడుదలయ్యే లోపు పన్నెండు జ్యోతిర్లింగాలను దర్శించుకుంటానని విష్ణు మంచు తెలిపారు.

# చేతి గడియారం ఆగిపోయిందా..?



ప్రతి పనికి మంచి ఘడియలు.. ముహూర్తం.. సమయం చూసుకుని అడుగు బయటకు పెట్టని బాలకృష్ణ చేతి గడియారం ఆగిపోయింది.. ఇది వినడానికి విచిత్రంగానే ఉన్నా.. ఇది మాత్రం కరక్టే.. ఎందుకో ఈ కథనాన్ని ఒక్కసారి చదవండి.. హిందూపురం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక సమయంలో ప్రతి నిమిషం ఎమ్మెల్యే బాలకృష్ణ చెప్పిన సమయానికే జరిగింది.. క్యాంపు నుంచి టిడిపి కౌన్సిలర్లను తీసుకురావడానికి ముహూర్తం.. టైం చెప్పింది ఎమ్మెల్యే బాలకృష్ణ.. మున్సిపల్ కార్యాలయానికి చేరుకోవడానికి ముహూర్తం పెట్టారు ఎమ్మెల్యే బాలకృష్ణ.. ఆఖరికి మున్సిపల్ ఛైర్మన్ గా ఎన్నికైన రమేష్ ప్రమాణస్వీకారం అనంతరం... ఛైర్మన్ కుర్చీలో కూర్చోవడానికి కూడా ముహూర్తం పెట్టారు. సరిగ్గా ఉదయం 11:30 నిమిషాలకు మున్సిపల్ ఛైర్మన్ గా ఎన్నికైన రమేష్ ఛైర్మన్ కుర్చీలో కూర్చోవాలని బాలకృష్ణ టైం డిసైడ్ చేశారు. అప్పటివరకు అన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ చెప్పిన సమయానికి.. సరిగ్గా ముహూర్తానికి... చెప్పిన టైంకే జరిగాయి. మున్సిపల్ ఛైర్మన్ రమేష్ ఛైర్మన్ కుర్చీలో కూర్చోవడానికి బాలకృష్ణ తో పాటు వేచి చూస్తున్నారు.. సరిగ్గా అదే సమయంలో బాలకృష్ణ అక్కడ ఉన్న మీడియా ప్రతినిధులకు ప్రతిదానికి టైం ఉంటుంది.. ఛైర్మన్ రమేష్ కుర్చీలో కూర్చోవడానికి కూడా.. అలాగే టైం డిసైడ్ అయిందంటూ అందరినీ నవ్వించారు.

# రామ్‌చరణ్ సినిమా కోసం పాత టెక్నాలజీ



గేమ్ ఛేంజర్‌కు ఫలితంతో పని లేకుండా నటుడిగా మరో మెట్టు ఎక్కారు రామ్ చరణ్. ముఖ్యంగా అప్పన్న పాత్రకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్ర షూటింగ్ నాన్‌స్టాప్‌గా నడుస్తుంది. దీనికోసం కొత్తగా పాతకాలం టెక్నాలజీని వాడుకోబోతున్నారు బుచ్చిబాబు. ఇదే ట్రెండింగ్ న్యూస్ ఇప్పుడు. ఇప్పుడు నడుస్తున్నదంతా డిజిటల్ యుగమే.. అన్నింటికీ హార్డ్ డిస్కులే. అందుకే RC16 కోసం సినిమాటోగ్రఫర్ రత్నవేలు సినిమాలో కొంత భాగానికి నెగటివ్ రీల్ వాడనున్నట్లు తెలుస్తుంది. RC16 పీరియడ్ సినిమా కాబట్టి.. రీల్‌తో షూట్ చేస్తే బాగుంటుందనేది రత్నవేలు ఆలోచన. హాలీవుడ్‌లో క్రిస్టోఫర్ నోలెన్ ఓపెన్ హైమర్ సినిమాను ఇలాగే షూట్ చేసి రీల్స్ భద్రపరిచారు. హై బడ్జెట్ క్వాలిటీ కోసం కాంప్రమైజ్ కాలేదు. తాజాగా RC16లో కొంత భాగానికే ఇదే చేయాలని చూస్తున్నారు. ఇది వర్కవుట్ అయితే.. టాలీవుడ్‌లో మళ్లీ నెగిటివ్ రీల్ మేకింగ్‌కు ఊపొస్తుందేమో..?



# పింక్ చీరలో పిచ్చెక్కించిన నభా నటేష్..

2018లో వచ్చిన నన్నుదోచుకుందువటే సినిమా కంటే ముందు కొన్ని కన్నడ సినిమాల్లో మెరిసిందీ అందాల తార. ఇక పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైందీ ముద్దుగుమ్మ. ఇస్మార్ట్ శంకర్ తన అందం నటనతో ఆకట్టుకుంది. ఇస్మార్ట్ శంకర్ సినిమాలో తన గ్లామర్ తో కట్టిపడేసింది నాభా.

ఇండస్ట్రీలో ఎంతో మంది క్రేజీ భామలు కుర్రాళ్ళ గుండెల్లో స్థానం సంపాదించుకుంటున్నారు. వారిలో ఈ వయ్యారి భామ ఒకరు. చేసింది తక్కువ సినిమాలే కానీ క్రేజ్ మాత్రం మాములుగా రాలేదు. నన్నుదోచుకుందువటే సినిమాతో పరిచయం అయ్యింది నభా నటేష్. 2018లో వచ్చిన నన్నుదోచుకుందువటే సినిమా కంటే ముందు కొన్ని కన్నడ సినిమాల్లో మెరిసిందీ అందాల తార. ఇక పూరి జగన్నాథ్ తెరకెక్కించిన ఇస్మార్ట్ శంకర్ సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మరింత దగ్గరైందీ ముద్దుగుమ్మ. ఇస్మార్ట్ శంకర్ తన అందం నటనతో ఆకట్టుకుంది. ఇస్మార్ట్ శంకర్ సినిమాలో తన గ్లామర్ తో కట్టిపడేసింది నాభా. ఆతర్వాత తెలుగులో కొన్ని సినిమాల్లో కనిపించింది. డిస్కో రాజా, అదుగో, సోలో బ్రతుకే సో బెటర్, అల్లుడు అదుర్స్, మ్యాస్ట్రో తదితర సినిమాల్లో నటా నటేష్ అభినయానికి మంచి మార్కులు పడ్డాయి. కానీ నభా నటించిన సినిమాలు బాక్సాఫీస్ దగ్గర అంతగా ఆకట్టుకోలేకపోయాయి. అదే సమయంలో ప్రమాదానికి గురవ్వడంతో సినిమాలకు బ్రేక్ ఇచ్చింది. ఇప్పుడు తిరిగి కోలుకొని సినిమాలు చేయాలని చూస్తుంది. మొన్నామధ్య చేసిన డార్లింగ్ సినిమా నిరాశపరిచింది. ప్రస్తుతం నిఖిల్ తో ఓ సినిమా చేస్తుంది. ఆ సినిమా తప్పా న నభా చేతిలో కొత్త సినిమా లేదు. కానీ సోషల్ మీడియాలో తన వయ్యారాలతో దర్శకనిర్మాతలకు గాలులు వేస్తుంది ఈ చిన్నది. ఈ అమ్మడి గ్లామరస్ ఫోటోలు తెగ వైరల్ అవుతున్నాయి.



# 'ఇట్స్ కాంప్లికేటెడ్' ఫిబ్రవరి 14న విడుదల

స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డ రొమాంటిక్ కామెడీ చిత్రం కృష్ణ అండ్ హిస్ లీల. 2020లో కరోనా మహమ్మారి సమయంలో OTTలో నేరుగా విడుదలైన ఈ సినిమా ఇన్స ్టట్ హిట్ సాధించింది. రవికాంత్ పెరెపు దర్శకత్వంలో రానా దగ్గుబాటి, సంజయ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం లవ్ స్టోరీ పై ఒక రిఫ్రెషింగ్ టేక్, ఇందులో శ్రద్ధా శ్రీనాథ్, సీరత్ కపూర్, షాలిని వడ్నికట్టి కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడు, రానా దగ్గుబాటి ఈ పాపులర్ చిత్రాన్ని ప్రేమికుల రోజున థియేటర్లలో విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నారు. డిజిటల్ లో మాత్రమే విడుదలైన ఈ చిత్రం ఫిబ్రవరి 14న కొత్త ట్విస్ట్ తో థియేటర్లలోకి వస్తుంది ఈ సినిమా టైటిల్‌ను 'ఇట్స్ కాంప్లికేటెడ్'గా మార్చారు. ఈ కొత్త టైటిల్ మరింత ఆసక్తిని జోడించడమే కాకుండా, సినిమా కంటెంట్ కి పర్ఫెక్ట్ గా యాప్ట్ అయ్యింది. రానా దగ్గుబాటి, సిద్ధు జొన్నలగడ్డ, దర్శకుడు రవికాంత్ పెరెపు ఓ హిలేరియస్ వీడియోతో ఈ అనౌన్స్మెంట్ చేశారు. ప్రమోషనల్ యాక్టివిటీస్ గురించి కూడా హింట్ ఇచ్చారు. ట్యాలంటెడ్ శ్రీచరణ్ పాకాల సంగీతం అందించిన ఈ సినిమాకి షానియల్ డియో, సాయి ప్రకాష్ ఉమ్మడిసింగు డీవోపీగా పని చేశారు, ఇట్స్ కాంప్లికేటెడ్ హ్యూమర్, ఎమోషనల్ హై అందిస్తుందని ప్రామిస్ చేస్తోంది.

# 'సతీ లీలావతి' ప్రారంభం..



ప్రముఖ నిర్మాణ సంస్థ ఆనంది ఆర్ట్స్ సమర్పణలో.. వైవిధ్యమైన ప్రాతలతోకథానాయికగా తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు సంపాదించుకున్న లావణ్య త్రిపాఠి, మలయాళ నటుడు దేవ్ మోమన్ ప్రధాన పాత్రల్లో దుర్గాదేవి పిక్చర్స్, ట్రియో స్టూడియోస్ పతాకాల సంయుక్త నిర్మాణ సారథ్యంలో ప్రొడక్షన్ నెం. 1గా భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి )తదితర విభిన్న చిత్రాల దర్శకుడు తాతినేని సత్య దర్శకత్వంలో నాగమోహన్ బాబు.ఎమ్, రాజేష్.టి నిర్మాతలుగా రూపొందుతోన్న చిత్రం 'సతీ లీలావతి'. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాత హరీష్ పెద్ది క్లాప్ కొట్టారు. మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ డైరెక్టర్ టి.ఎల్.వి.ప్రసాద్ గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు తాతినేని సత్య "ఆహ్లాదాన్ని కలిగించే చక్కటి ఎంటర్‌టైనర్‌గా 'సతీ లీలావతి' రూపొందుతుంది. మనస్ఫూర్తిగా నవ్వుకునే రొమాంటిక్ డ్రామాగా అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే అంశాలతో సినిమా తెరకెక్కుతుంది. లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ జోడీ ఫ్రెష్ లుక్‌తో మెప్పించనున్నారు. సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను కూడా ప్రారంభిస్తున్నాం" అన్నారు.





# పాన్ ఇండియన్ మూవీ 'వృషభ' షూటింగ్ పూర్తి

కంప్లీట్ యాక్టర్ మోహన్ లాల్ ప్రస్తుతం ఓ భారీ బడ్జెట్ మూవీతో ఆడియెన్స్ ముందుకు రాబోతోన్నారు. పాన్ ఇండియన్ ప్రాజెక్ట్‌గా ఈ మూవీని కనెక్ట్ మీడియా, బాలాజీ టెలీ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తోంది. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా భారీ స్థాయిలో ఈ మూవీని శోభా కపూర్, ఏక్తా కపూర్, సీకే పద్మ కుమార్, వరుణ్ మాథుర్, సౌరభ్ మిశ్రా, అభిషేక్ వ్యాస్, విశాల్ గుర్నాని నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి నంద కిషోర్ దర్శకత్వం వహిస్తున్నారు. మైథలాజికల్, యాక్షన్, ఎమోషనల్ కంటెంట్ తో రాబోతోన్న 'వృషభ' చిత్రాన్ని టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌లో రూపొందిస్తున్నారు. ఈ మూవీ షూటింగ్ చివరి షెడ్యూల్ ముంబైలో ముగిసింది. ఇక షూటింగ్ పూర్తి అవ్వడంతో సెట్ లో చిత్రయూనిట్ అంతా కూడా సందడి చేశారు. కేక్ కట్ చేసి తమ ఆనందాన్ని పంచుకున్నారు. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ పూర్తి అవ్వడంతో పోస్ట్ ప్రొడక్షన్ పనుల్ని స్టార్ట్ చేయనున్నారు. విజువల్ ఎఫెక్ట్స్, సౌండ్ డిజైన్, ఎడిటింగ్ ఇలా అన్ని పనుల్ని ప్రారంభించబోతోన్నారు. ఈ మూవీని మలయాళం, తెలుగు భాషల్లో తెరకెక్కించారు. ఈ ఏడాది దీపావళి కానుకగా ఈ సినిమాను భారీ ఎత్తున రిలీజ్ చేయబోతోన్నారు. మలయాళం, తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఈ సినిమాను గ్రాండ్‌గా రిలీజ్ చేసేందుకు మేకర్లు ప్లాన్ చేస్తున్నారు. లార్జర్ దెన్ లైఫ్ అన్నట్టుగా ఈ సినిమా ఉంటుందని మేకర్లు తెలిపారు. ప్రతీ ఒక్క సీన్ రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తాయని అంటున్నారు. ఇండియన్ సినీ హిస్టరీలో మరుపురాని చిత్రంగా వృషభ నిలుస్తుందని మేకర్లు ఎంతో నమ్మకంగా చెబుతున్నారు. మున్ముందు మరింతగా ప్రమోషనల్ కంటెంట్‌ను వదిలి సినిమాపై ఆసక్తిని పెంచబోతోన్నారు. వృషభ జర్నీ ఇప్పుడే మొదలైందని, ఎన్ని అంచనాలు పెట్టుకున్నా.. అంతకు మించేలా ఉంటుందని దర్శక, నిర్మాతలు చెబుతున్నారు. అద్భుతమైన డిజైన్, బ్యాక్ డ్రాప్ తో ఈ పోస్టర్ అంచనాలను రేకెత్తిస్తుంది. ఈ సినిమా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. గొప్ప కథతో, కాంత తప్పనిసరిగా చూడవలసిన సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ గా రూపొందుతోంది.